# మొగ్గలు

ఉమాశివ



చాలా కాలానికి వచ్చిన మమ్మల్ని చూసి ప్రమద చాలా ఆనందపడిపోయింది. "పని, ఆఫీస్, పిల్లలహోంవర్క్స్ వీటన్నింటితో విసిగిపోయి నీదగ్గరకు వచ్చేశామే"... చెప్పానునేను. "మంచిపని చేసావక్కా... ఎప్పటినుండో నిన్ను చూడాలని మనసు కొట్టుకుపోతోంది. సొంత నర్సింగ్‌హోమ్ నడుపుతున్న కర్మానికి ఒకరోజన్నా వీలుచూసుకుని ఎవరిదగ్గరకీ వెళ్ళడానికి కుదరడం లేదు. అందుకే అమ్మావాళ్ళకు వాళ్ళనే ఒకసారి వచ్చి వెళ్ళమని రాసాను..." అందరికీ కాఫీలందిస్తూ ప్రమద అన్నది.

"ఏమ్మాపాపలూ... ఎలా చదువుతున్నారు" పిల్లలను పలుకరించింది.

"ప్రస్తుతానికి బాగానే చదువుతున్నారు. వీళ్ళిద్దర్ని నీలా డాక్టర్ కోర్స్ చదివించుదామని ఉంది నాకు ఆయనకేమో ఆయనలా ఇంజనీరో లేక ఐ.ఎ.యస్ చదివించుదామని ఉంది. రోజూ ఈ విషయం గురించి ఇద్దరం వాదించుకుంటుంటాం."

"అప్పటికి వాళ్ళేది ఇంట్రస్ట్‌గా చదివితే అది చదివిద్దురుగానిలే. కాని నాసలహా మాత్రం డాక్టర్ కోర్స్ చదివించ వద్దనే...." అన్నది ప్రమద. దాని మాటల్లో ఏదో నిర్లిప్తత .

"అదేమిటే అలా అంటావు.. వైద్యవృత్తి ఎంతో పవిత్రమైనది అంటూండేదానివి పైగా బోలెడు సంపాదిస్తున్నావుకూడాను" ఆశ్చర్యంగా అన్నాను.

"సంపాదనకేమీ కొదవుండదక్కా... పవిత్రతంటావా... ఉదయం లేచింది మొదలు మేం ఎన్ని ఘాతుకాలు చూడాల్సి ఉంటుందో తెలుసా... ఈ వృత్తి అంటేనే విరక్తి పుడుతోంది" అన్నది. 'ఏమిటి ప్రమద ఇలా మాట్లాడుతోంది' అని ఆలోచనలో పడ్డాను.

మర్నాడు ఫలహారాలు ముగిసాక మావారు, మరిది గారు పిల్లల్ని తీసుకుని జూకెళ్దమని ప్రోగ్రాం వేసారు.

"నేనురాలేను రెండు ఎమర్జెన్సీ కేసెస్‌కి అటండ్ అవ్వాలి. రెండు ఆపరేషన్ కేసెస్ ఉన్నాయి" అన్నది ప్రమద.

"సరే మీరంతా జూకి వెళ్ళండని చెప్పి మేం హాస్పటల్‌కి బయలుదేరాం. అప్పటికే అక్కడ చాలా మంది పేషెంట్స్ ఎదురు చూస్తున్నారు. చెప్పొద్దూ... ఆపేషెంట్స్‌ని చూడగానే కాస్త నవ్వు కూడా వచ్చింది. ఎందుకంటే అక్కడ కూర్చున్న పేషెంట్స్‌లో మూడు వంతుల ప్రెగ్నెంట్ లేడీస్. కొందరికి చిన్న కడుపు.. మరికొందరికి నెలలు నిండి పెద్ద కడుపులు. అంతమంది ప్రెగ్నెంట్స్‌ని ఒకచోట చూడడం తమాషాగా అనిపించింది.

ఆయా ఒక్కొక్కర్ని నెంబర్స్ ప్రకారం పిలుస్తూంటే ప్రమద వాళ్ళను పరీక్షించి మందులు రాసివ్వసాగింది. అందర్నీ చూడడం ముగించి, "అక్కా! నేను రౌండ్స్ ముగించుకుని ఆపరేషన్స్ చేసి వచ్చేసరికి కనీసం ముప్పావుగంట పడుతుంది ఈలోగా ఈ బుక్స్ తిరిగేయి. కాఫీ ఫ్లాస్క్‌లో ఉంది" అని చెప్పి అసిస్టెంట్ డాక్టరును తీసుకుని వెళ్ళి గంటలో ఆపరేషన్స్ ముగించుకుని వచ్చి ఆలా కుర్చీలో కూర్చుందోలేదో

"డాక్టర్... ఆ నాలుగో నెంబర్ బెడ్‌మీదున్న పిల్ల ఒకటే అరుస్తుందమ్మా. నొప్పిబాగా వస్తుందట..." గాభరాగా అంటూ వచ్చింది ఆయా.

"ఇద్దరు నర్స్‌లను దగ్గరుంచాను . హెడ్‌నర్స్‌ని కూడా అటెండ్ అవమను. ప్రమాదమేమిలేదు. ఈ కేస్ విషయంలో ఇక నన్ను పిలవకండి"...నిర్లక్ష్యంగా జవాబు చెప్పి కూర్చుంది ప్రమద.

ఇప్పటివరకు నేను చూసిన ప్రమద ఈ ప్రమద ఒకరేనా అని ఆశ్చర్యపోయాను. అలసిపోయిందేమోనని ఫ్లాస్క్ తీసి రెండు కప్పుల కాఫీ పోసి తనకొకటి అందించి నేనొకటి తీసుకున్నాను.

"చాలా తక్కువ సమయంలో నర్సింగ్‌హోంని చక్కగా డెవలప్ చేసావే ప్రమదా నిన్ను చూస్తుంటే చాలా సంతోషంగా ఉంది.." అన్నాను.

చిన్నగా నవ్వింది ప్రమద. ఓ ఐదునిమిషాలలా మాట్లాడుకున్నామో లేదో ఇంకో పేషెంట్ వచ్చింది భర్తతోసహా.

ప్రమద వెళ్ళి ఆమెను చెక్‌చేయ నారంభించింది. టెస్ట్‌లయాక...

"జనరల్ చెకప్‌కి వచ్చారనుకుంటా. షీ ఈజ్ ఆల్‌రైట్. డెలివరీ డేట్ ప్రిస్క్రిప్షన్ మీద రాసాను. ఏడవనెలలో వచ్చి టి.టి. ఇంజక్షన్ తీసుకోమ్మా.అంతదాక ఈ మందులు వాడు..." ప్రిస్క్రిప్షన్ అందిస్తూ అన్నది ప్రమద.

"డాక్టర్ మాకు ఇప్పుడే పిల్లలు వద్దు"..చెప్పింది మెల్లిగా ఆ అమ్మాయి.

"ఆ విషయం మీకు నాలుగో నెల వచ్చాక నిర్ణయించుకున్నారా...పిల్లలు ఇప్పుడే వద్దనుకునేవారు. ఆ విషయంలో ముందు నుండే జాగ్రత్తగా ఉండాలి." తీవ్రంగా అన్నది ప్రమద.

"సారీ డాక్టర్. నేను తెలుసుకునేసరికి చాలా ఆలస్యమైంది. ఇపుడు అబార్షన్ చేయించుకోవాలనుకుంటున్నాం. మీరే చెయ్యాలి ఎలాగైనాసరే"...రిక్వెస్టింగ్ అన్నదామె.

"ఈసారికి బిడ్డను కనేయండి...నెక్స్ట్‌టైమ్ గ్యాప్ ఇద్దురుగాని...." నచ్చజెబుతున్నట్లుగా అన్నది ప్రమద.

"నో డాక్టర్..." భార్య భర్త లిద్దరూ అన్నారు.

"అసలు మీరు ఎందుకు ఇప్పుడే పిల్లలు వద్దనుకుంటున్నారో చెబుతారా..."అనునయంగా అడిగింది.

"నేను...నేను ఎమ్.ఎస్.సి చదువుతున్నాను. నా చదువుకు ఆటంకమవుతుందని"...గొణిగిందామె.

"ఎమ్మెస్సీ చదువుతున్నా నీవు ఇన్నాళ్లూ నీ ప్రెగ్నెన్సీని కన్‌ఫంచేసుకోలేకపోయావా చూడమ్మా...నీవు ఎమ్.ఎస్.సి చదువుతున్నమాట నిజమే కావచ్చు. కాని మీరిద్దరుభార్య భర్తలన్నది నిజమైన విషయం కాదు. నీ మెడలో పసుపుతాడు కేవలం గంట క్రితం వేసుకున్నదని జాకెట్‌కి అంటుకున్న పసుపే చెబుతుంది. పెళ్ళైన ఆడవాళ్ళు మంగళసూత్రాలు లోపలికి వేసుకుంటారు. పెళ్ళైందని నమ్మించాలనుకునే నీలాంటి వాళ్ళు మాత్రమే ఇలా బయటకు వేసుకుంటారు. నీ పర్సనల్ విషయాలు నాకనవసరంకానీ డాక్టర్‌గా నేనెవరికైనా వీలైనంత వరకు అబార్షన్ విరమించుకొమ్మనే సలహా ఇస్తాను. ఈసారికి అబార్షన్ చేసేస్తాను. కాని ఆ తరువాతైనా ఈ అబ్బాయి నిన్ను పెళ్ళిచేసుకుంటాడో లేదో ఆలోచించుకొమ్మని ఓ ఫ్రెండ్‌లా సలహా ఇస్తున్నాను"

ప్రమద మాటలకు నేను దిమ్మెరపోయి చూస్తున్నాను. తలవంచుకుని కూర్చున్న ఆ అమ్మాయి బుగ్గల మీదుగా నీరు జారిపోతున్నాయి. ఆ అబ్బాయి మాత్రం...

"మీరు అబార్షన్ చేస్తారో లేదో చెప్పండి...మిగతా విషయాలన్నీ మీ కనవసరం. ఇప్పుడు అబార్షన్ చట్ట వ్యతిరేకం కాదు. అబార్షన్ చేసేటట్లైతే మీ ఫీజెంతో చెప్పండి..." రఫ్‌గా అన్నాడు.

"వెరీగుడ్...రూల్స్ అండ్ రెగ్యులేషన్స్ తెల్సిన

